

సమావేశం నిర్వాహణకు వచ్చిన ప్రత్యేకాధికారి, ఆర్డీవో కృష్ణవేణి, కమిషనర్ వెంకటస్వామి

వీగిన అవిశ్వాసం

- పారని 14 మంది కౌన్సిలర్ల పాచిక
- కోరం లేక వీగిన తీర్మానం
- ముగ్గురు కౌన్సిలర్ల వల్లే నెగ్గని అవిశ్వాసం
- చైర్మన్ పదవిని నిలబెట్టుకున్న గుంటి రజని
- నర్సంపేట బీఆర్ఎస్‌లో ముదిరిన ముసలం

7



నర్సంపేటలో సహచర కౌన్సిలర్లతో కలిసి మాట్లాడుతున్న వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి

బీఆర్ఎస్ పార్టీకి 14 మంది రాజీనామా

7

- త్వరలోనే కౌన్సిలర్ల పదవులకీ రాజీనామా చేస్తాం
- చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం వీగిపోవడం బాధాకరం..
- మునిసిపల్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి వెల్లడి

'పార్క్'కు షాక్



నిర్మాణంలో కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్

మెగా టెక్స్‌టైల్ పార్కుకు దక్కని గ్రీన్ ఫీల్డ్ హోదా

- గత బీఆర్ఎస్ ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితం
- ఎస్‌పీఏ ఏర్పాటులో జాప్యం
- కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు గల్లంతు
- ఢిల్లీలో వాకబు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- తాజాగా ప్రతిపాదనలు చేసేందుకు చర్యలు

వరంగల్ జిల్లా గీసుగొండలో ఏర్పాటవుతున్న కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ)కి ఇప్పట్లో గ్రీన్ ఫీల్డ్ హోదా లభించే అవకాశాలు లేవు. పీఎం మిత్ర పథకంలో భాగంగా ఈ టెక్స్‌టైల్ పార్క్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఇదివరకే లభించింది. అయితే బ్రౌన్ ఫీల్డ్ నుంచి గ్రీన్‌ఫీల్డ్‌గా మారితే ఈ పార్క్‌కు గ్రాంట్ల రూపంలో అదనంగా రూ.300కోట్ల నిధులు వస్తాయి. కానీ గత ప్రభుత్వం నిర్లక్ష్యంవల్ల గ్రీన్ ఫీల్డ్ హోదా రాకుండా పోయింది. కేఎంటీపీకి గ్రీన్‌ఫీల్డ్ హోదా కల్పించాలని కోరుతూ గత ప్రభుత్వం ప్రతిపాదనలు సమర్పించిం ది కానీ.. తర్వాత చర్యలను తీసుకోలేదు.

హనుమకొండ, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): వరంగల్‌లోని గీసుగొండలో మొత్తం 1200 ఎకరాలలో రూ.1500 కోట్ల వ్యయంతో కాకతీయ మెగాటెక్స్‌టైల్ పార్క్ ఏర్పాటవుతోంది. పీఎం మిత్ర (మెగా ఇంటిగ్రేటెడ్ టెక్స్‌టైల్ రీజియన్, అపరెల్) పార్క్‌ల పథకం కింద ఆమోదం పొందిన ఏడు మెగా టెక్స్‌టైల్ పార్కులలో వరంగల్‌లోని ఈ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ) కూడా ఉన్నది. ఈ పథకం 2021-22 నుంచి 2027-28 వరకు ఐదేళ్లపాటు అమలులో ఉంటుంది. ఈ పార్క్‌లో యూనిట్లను స్థాపించేందుకు ఇప్పటికే కేరళకు చెందిన కిటెక్స్ గార్మెంట్స్‌తో పాటు ప్రపంచంలోనే అతిపెద్ద పిల్లల దుస్తుల తయారీదారుల్లో ఒకటైన దక్షిణ కొరియాకు చెందిన యంగ్‌వన్ కార్పొరేషన్, గణేషా ఎకోస్పియర్ వంటి కంపెనీలు ముందుకువచ్చాయి. ఎంవోయూలు కూడా జరిగాయి. 2017లో అక్టోబర్ 22న అప్పటి సీఎం కేసీఆర్ ఈపార్క్‌కు శంకుస్థాపన చేశారు. ఏడేళ్లవుతున్నా పార్క్ పూర్తిరూపాన్ని ఇంకా సంతరించుకోలేదు. 14 కంపెనీలు రానున్నట్టు బీఆర్ఎస్ ప్రభుత్వం చెప్పినా ఇప్పటివరకు వచ్చినవి నాలుగు కంపెనీలే. వీటి యూనిట్లు ఏర్పాటు ఇప్పుడిప్పుడే జరుగుతోంది.

దక్కని గ్రీన్ ఫీల్డ్ హోదా?

మెగా టెక్స్‌టైల్‌కు బ్రౌన్ ఫీల్డ్ హోదా ఎప్పుడో వచ్చింది. దీని కింద రూ.200కోట్ల మేరకు పార్క్‌కు రాయితీలు అందనున్నాయి. అయితే ఇదే క్రమంలో గ్రీన్ ఫీల్డ్ హోదా కోసం గత ప్రభుత్వం వెంటనే ప్రయత్నాలు చేపట్టాల్సి ఉంది. నిజానికి పాత టెక్స్‌టైల్ పార్క్‌లకు గ్రీన్‌ఫీల్డ్ హోదా రావడం కష్టం. ఇందు కోసం అవి కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ విధించిన నిబంధనలను పూర్తి చేయాల్సి ఉంటుంది. కానీ వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్క్ కొత్తది. పార్క్ ఏర్పాటు క్రమంలోనే గ్రీన్‌ఫీల్డ్ హోదా ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని డిజైన్లకు రూపకల్పన చేశారు. అన్ని వివరాలతో కూడిన ప్రతిపాదనలను రూపొందించి సకాలంలో పంపి ఉంటే ఈ పాటికే ఆ హోదా వచ్చి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

కొత్త సర్కారు వాకబు

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్‌రెడ్డి దీని విషయమై ఇటీవల న్యూఢిల్లీలో వాకబు చేయగా, ఆ ప్రతిపాదన తిరస్కరణకు గురైనట్టు తెలిసింది. ఇప్పటికే పార్క్‌కు గ్రీన్‌ఫీల్డ్ హోదా వచ్చి ఉంటే.. ఫిబ్రవరి 1న కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ప్రవేశ పెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో బ్రౌన్‌ఫీల్డ్ కింద రూ.200కోట్లతో పాటు గ్రీన్ ఫీల్డ్ కింద అదనంగా రూ.300కోట్లు కలుపుకొని మొత్తంగా రూ.500కోట్ల వరకు వచ్చి ఉండేవి. కానీ ఆ అవకాశం ఈసారి చేజారిపోయింది. గ్రీన్‌ఫీల్డ్ హోదా మంజూరుకు అవసరమైన పూర్తిస్థాయి ప్రక్రియను గత ప్రభుత్వం పూర్తి చేయలేకపోయినట్టు తెలుస్తోంది. దీనితో ప్రతిపాదనను కేంద్రం తిరస్కరించింది. ఫలితంగా కేంద్రం

మిగతా 8వ పేజీలో..



గిరిజన విశ్వవిద్యాలయానికి నిధులు

ములుగు జిల్లా గట్టమ్మ ఆలయం సమీపంలో ఏర్పాటవుతున్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయానికి తాత్కాలిక బడ్జెట్‌లో నిధుల మంజూరు జరిగేనా? అని ఆ జిల్లా ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. ఎన్నికల వాగ్దానంలో భాగంగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఈ విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేసింది. స్థల సేకరణ కూడా పూర్తయింది. నిధులు మంజూరు కావలసి ఉన్నది. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఉక్కు ఫ్యాక్టరీకి కూడా ఈ బడ్జెట్‌లో మోక్షం లభించగలదన్న ఆశతో ఆ జిల్లా ప్రజలు ఉన్నారు.

కలగా కాజీపేట రైల్వే డివిజన్

తాత్కాలిక బడ్జెట్‌లో అయినా కాజీపేట జంక్షన్‌ను రైల్వే డివిజన్‌గా ఉన్నతీకరించాలన్న డిమాండ్‌కు మోక్షం లభించేనా? ఇది ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల చిరకాల వాంఛ. కాజీపేట రైల్వే డివిజన్ ఏర్పాటుకు అన్ని అర్హతలున్నాయి. నిజాం కాలంలో ఏర్పాటైన పురాతన రైల్వే స్టేషన్ భారత దేశ ముఖద్వారంగా చెబుతారు. దక్షిణ మధ్యరైల్వేలో అత్యధిక ఆదాయం సమకూర్చే జంక్షన్ ఇదే. ఈ స్టేషన్ మీదుగా 186 రైళ్లు వెళతాయి. రోజుకు 30వేల మందికిపైగా ప్రయాణికులు ఈ జంక్షన్ గుండానే ప్రయాణిస్తారు. అపారమైన బొగ్గు నిల్వలున్న మణుగూరు, కొత్తగూడెం, రామగుండం, గోదావరిఖని, భూపాలపల్లి దీని పరిధిలోనే ఉన్నాయి. దక్షిణ మధ్య రైల్వేని ఆరు డివిజన్లలో ఏపీలో మూడు రైల్వే డివిజన్లు ఉండగా, తెలంగాణలో సికింద్రాబాద్ ఒక్కటే డివిజన్‌గా ఉంది. కనీసం ఈ సారి బడ్జెట్‌లో అయినా కాజిపేట డివిజన్ ప్రతిపాదన ప్రస్తావనకు వస్తుందేమోనని ప్రజలు ఆశిస్తున్నారు.

అదనపు రైల్వే లైన్లు

పెరుగుతున్న ప్రయాణికులు, సరుకుల రవాణా రద్దీ దృష్ట్యా కాజీపేట జంక్షన్ మీదుగా కొత్త రైల్వేలైన్లు వేయాలన్న డిమాండ్ కూడా ఎప్పటి నుంచో ఉంది. ప్రతీసారి బడ్జెట్ సందర్భంగా జిల్లా ప్రజలు కోరుతూనే ఉన్నారు. కానీ ఆచరణకు నోచుకోలేదు. కానీ సారైనా బడ్జెట్‌లో కొత్త రైల్వే లైన్లకు అవకాశం లభించేనా అన్నది చూడాలి. వరంగల్-భూపాలపల్లి, కాజీపేట-భూపాలపల్లి, స్టేషన్ ఘన్‌పూర్-సూర్యాపేట మధ్య కొత్త లైన్లను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. అలాగే రోడ్ ఓవర్ బిడ్జిల (ఆర్‌వోఆర్) పనులను వేగవంతం చేయాల్సి ఉంది.

కొన్ని పనులను సత్వరం ప్రారంభించాల్సి ఉంది. జనగామ-దుద్దెడ మధ్య పెంబర్తి వద్ద, మానుకోట పట్టణంలో, కురవి గేట్ సమీపంలో ఆర్‌వోఆర్‌లను నిర్మించాల్సి ఉంది. మహబూబాబాద్ పట్టణంలో ఆర్‌వోబీకి రూ.52కోట్లు మంజూరైనా సకాలంలో పనులు మొదలు కాక నిధులు వెనక్కి వెళ్లిపోయాయి. కాజీపేట ఫాతిమానగర్ బ్రిడ్జి విస్తరణ పనులు సత్వరం పూర్తి చేయాల్సి ఉంది.

రైల్వేని అద్భుత రవాణా వ్యవస్థగా మారుస్తున్న ప్రధాని : బీజేపీ



ఇంటర్‌సిటీకి స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

నెక్కొండ, జనవరి 30 : రైల్వే శాఖను అద్భుతమైన రవాణా వ్యవస్థగా మార్చేందుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రూ.2.40లక్షల కోట్లు అభివృద్ధి నిధులను కేటాయించారని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు గంట రవికుమార్‌లు తెలిపారు. మంగళవారం నెక్కొండలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ రైలు ప్రమాదాల నివారణకు కవచ్ వంటి నూతన టెక్నాలజీని ప్రవేశపెట్టారన్నారు. ప్రయాణికులు త్వరగా గమ్యస్థాలకు చేర్చేందుకు రైళ్ల వేగం పెంచడమే కాకుండా, దానికి అనుగుణంగా ట్రాక్‌లను నిర్మిస్తున్నారన్నారు. మూడో రైల్వే ట్రాక్ నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి అభివృద్ధికి శ్రీకారం చుట్టాలన్నారు. ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ప్రజలకు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను వెంటనే తీర్చాలని డిమాండ్ చేశారు. అయోధ్యలో బాలరాముడిని ప్రతిష్ఠించడంతో దేశంలో పది కాలలపాటు మోదీ పాలనను ప్రజలు కోరుకుంటున్నారన్నారు.

నెక్కొండలో ఇంటర్‌సిటీ హాల్టింగ్ ఇప్పించుటకు రైల్వే బోర్డు మెంబర్‌గా ఉన్న సమయంలో వినతిపత్రాలను ఇచ్చినట్లు ప్రేమెందర్‌రెడ్డి తెలిపారు. సమావేశంలో జిల్లా కన్వీనర్ ఎడ్ల అశోక్‌రెడ్డి, నాయకులు గుగులోతు స్వరూప, శ్రీనివాస్, సింగారపు సురేష్, సొంటిరెడ్డి వేణుగోపాల్‌రెడ్డి, బీజేవైఎం మండల అధ్యక్షుడు కక్కెర్ల అనిల్, అంబాల రాంగోపాల్, శ్రీరంగం శ్రీనివాస్, సంపత్, రాపాక సందీప్, రాజు, మోహన్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, రామారావు పాల్గొన్నారు. కాగా, పనికర సర్పంచ్ పింగళి విజయ భర్త బీఆర్ఎస్ నాయకులు మోహన్‌రెడ్డి బీజేపీలో చేరగా ప్రేమేందర్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.

ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు ఘనస్వాగతం

నెక్కొండ, జనవరి 30 : సికింద్రాబాద్-గుంటూరు జంక్షన్ వెళ్లే ఇంటర్‌సిటీ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు నెక్కొండలో హాల్టింగ్ ఇవ్వడంతో మంగళవారం వివిధ పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు, వ్యాపారులు ఆ రైలుకు ఘనస్వాగతం పలికారు. ఇంటర్‌సిటీ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ నెక్కొండకు చేరుకున్న వెంటనే ఇంజన్‌ను రకరకాల పూలు, కొబ్బరి మట్టలు, రంగు రంగు కాగితాలతో అలంకరించారు. అనంతరం డ్రైవర్, స్టేషన్ మాస్టర్ సిబ్బందిని ఘనంగా శాలువాలతో సన్మానించారు. నెక్కొండ సర్పంచ్ సొంటిరెడ్డి యమునారంజిత్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రేమేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు రవికుమార్, కన్వీనర్ అశోక్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షకార్యదర్శులు సురేష్, వేణుగోపాల్‌రెడ్డి, వివిధ పార్టీల నాయకులు అంబాల రాంగోపాల్, శ్రీరంగం శ్రీనివాస్, గుంటుక సోమయ్య, రావుల హరీష్‌రెడ్డి, ఈదునూరి యాకయ్య, సాయికృష్ణ, సందీప్, రాజు, అశోక్, సోమయ్య, సారంగపాణి, కక్కెర్ల నాగయ్య పాల్గొన్నారు.

ప్రాణాలు బలిగొన్న పాత కక్షలు

- కౌకొండలో యువకుడి దారుణ హత్య
- గొడ్డలితో విచక్షణారహితంగా దాడి
- పరారీలో నిందితుడు, పోలీసుల గాలింపు



యుగేందర్ (ఫైల్)

పరకాల, జనవరి 30: పాత కక్షలు ఓ యువకుడి ప్రాణాలు బలితీసుకున్నాయి. స్వయానా దగ్గరి బంధువే గొడ్డలితో దాడిచేయడంతో అక్కడికక్కడే ప్రాణాలొదిలాడు. హనుమకొండ జిల్లా నడికూడ మండలం కౌకొండలో జరిగిన ఈ ఘటనతో గ్రామం ఉలిక్కిపడింది. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. కౌకొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మేకల రాజమ్మ-సారయ్య దంపతులకు నలుగురు కుమారులు, ఐదుగురు కూతుర్లు ఉన్నారు. కుటుంబంలో చిన్నవాడు యుగేంధర్ (36) డిగ్రీ పూర్తి చేసి 15 యేళ్లుగా దళితశక్తి, ధర్మసమాజ్ పార్టీలో పనిచేస్తున్నాడు. కాగా, ఇటీవల యుగేంధర్ సమీప బంధువు సారమ్మ మృతి చెందింది. సోమవారం సారమ్మ దశదిన కార్యక్రమంలో చిందుకళాకారులు గ్రామంలో కథ చెబుతుండగా అంబేద్కర్ సెంటర్‌లో రోడ్డుపై తన స్నేహితులతో యుగేంధర్ చలి మంట కాగుతున్నాడు. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన మేకల సిద్ధు ద్విచక్ర వాహనంపై వచ్చి యుగేంధర్‌పై గొడ్డలితో విచక్షణారహితంగా దాడి చేశాడు. ఈ దాడిలో యుగేంధర్ తల, మెడపై తీవ్రగా యాలు కావడంతో వెంటనే కుటుంబ సభ్యులు ఆటోలో పరకాలలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన యుగేంధర్‌ను వైద్యులు పరీక్షించి మృతి చెందినట్లు తెలిపారు.



నివాళులర్పిస్తున్న విశారదన్ మహరాజ్

పాత కక్షలతో సమీప బంధువైన మేకల సిద్ధు తన తమ్ముడు యుగేంధర్‌ను హత్య చేసినట్లు సోదరుడు మేకల రాజవీరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. ఆపై పోలీసు జాగిలాలతో పరిశీలించి, ఆధారాలు సేకరించినట్లు పోలీసులు తెలిపారు. దాడి చేసిన సిద్ధు పరారీలో ఉన్నట్టు పరకాల రూరల్ సీఐ మల్లేష్, ఎస్సై కొంకణాల సంతోష్ తెలిపారు. పరకాల ఏసీపీ కిషోర్‌కుమార్ ఆదేశాలతో కౌకొండ గ్రామంలో గొడవలు జరుగకుండా పికెటింగ్ ఏర్పాటు చేశారు. కాగా, మృతుడు యుగేంధర్‌కు వివాహం కాలేదు. తన తండ్రి, మాజీ సర్పంచ్ మేకల సారయ్య రెండేళ్ల కిందట అనారోగ్యంతో మృతి చెందాడు తల్లి రాజమ్మను చూసుకుంటూ ఇంటివద్దే ఉంటున్నాడు.

ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులం

- వనదేతల సన్నిధిలో మెరుగైన సేవలు అందిస్తాం..
- ములుగు ఎస్పీ శబరీశ్
- పూజారులు, ఆదివాసీ యువతతో సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శబరీష్

మేడారం, జనవరి 30: పోలీసులు ఖాకీ దుస్తులు వేసుకున్న భక్తులని ములుగు ఎస్పీ శబరీశ్ అన్నారు. వనదేవతలు సమ్మక్క, సారలమ్మ సన్నిధిలో మెరుగైన సేవలు అందించాలన్నదే ధ్యేయమన్నారు. ఇందుకు తమకు సహకరించాలని కోరారు. తాడ్వాయి మండలం మేడారం పోలీసు సమావేశ హాల్‌లో పూజారులు, ఆదివాసీ యువతతో ఆయన సమన్వయ సమావేశం నిర్వహించారు. మహాజాతర ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజులపాటు వైభవంగా జరుగుతుందన్నారు. జాతరణ విధుల్లో పాల్గొనే పోలీసులకు యువత తోడ్పాటు అందించి సేవల్లో భాగస్వాముల కావాలన్నారు. జాతర సమయంలో పూజారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపడతామన్నారు. ఊరేగింపులో సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజు, జంపన్న దేవతలను ఒక్కసారిగా గద్దెలకు చేర్చేందుకు డీఎస్పీ స్థాయి అధికారులతో రోప్ పార్టీని ఏర్పాటు చేయాలని ఎస్పీని పూజారులు కోరారు. సమ్మక్క దేవత ఊరేగింపులో మూడంచెల భద్రత వ్యవస్థను ఉంచాలన్నారు. ఆదివాసీ సంస్కృతీ సంప్రదాయాలపై అవగాహన ఉన్న పోలీసు అధికారులను నియమించాలన్నారు. సమ్మక్కకు చర్ప వంశీయులు సమర్పించే హారతికి భక్తుల రద్దీ కారణంగా ఇబ్బందులు తలెత్తుతున్నాయని తెలిపారు.

దీనిపై ఎస్పీ మాట్లాడుతూ.. ఇలాంటి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. గత జాతరలో జరిగిన పొరపాట్లను సరిదిద్దుకుంటామని అన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు లక్షల్లో అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తారని, వారికి ఎలాంటి అసౌకర్యాలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందన్నారు. జాతర విజయవంతానికి యువత సహకారం ముఖ్యమన్నారు. మేడారం తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకునే భక్తులందరినీ మన అతిథులుగా భావించి సేవలందించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు రవీందర్, సుభాష్, పస్రా సీఐ శంకర్, తాడ్వాయి ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, ప్రధాన పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్ధబోయిన జగ్గారావు, సిద్ధబోయిన మునీందర్, లక్ష్మణ్‌రావు, మహేష్, సారయ్య, కృష్ణయ్య, కిరణ్, వెంకటేశ్వర్లు, భుజంగరావు, లక్ష్మణ్‌బాబు, కనకమ్మ, గోవర్ధన్, రాజు, బుచ్చిరాములు, మేడారం, ఊరట్టం, కన్నెపల్లి, కొండాయి, మల్యాల, పునుగొండ్ల గ్రామాల ఆదివాసీ యువత పాల్గొన్నారు.

వనదేవతలకు మొక్కులు



వనదేవతలను దర్శించుకుంటున్న భక్తులు

మేడారం, జనవరి 30: వనదేవతలు సమ్మక్క, సారలమ్మను దర్శించుకోవడానికి భక్తులు మంగళవారం భారీ సంఖ్యలో తరలివచ్చారు. ఫిబ్రవరి 21న మహాజాతర ప్రారంభం కానుండగా ముందస్తుగా తల్లులకు మొక్కులు చెల్లించుకున్నారు. 20వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్టు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మేడారం చేరుకున్న భక్తులు ముందుగా జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించారు. కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. శివశక్తుల పూనకాలు డోలు, సన్నాయిల మధ్య గద్దెలకు చేరుకున్నారు. కుటుంబ సమేతంగా తల్లులకు పూజలు చేశారు. అనంతరం మేడారం పరిసరాల్లో విడిది చేసి వంటావార్పు చేశారు.

ఈవీఎం, వీవీప్యాట్‌లపై విస్తృత ప్రచారం కల్పించాలి



వీవీ ప్యాట్‌లను ప్రారంభించిన కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్, జనవరి 30: జిల్లా వ్యాప్తంగా ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం, వీవీ ప్యాట్‌ల వినియోగంపై విస్తృత ప్రచారం కల్పించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ఈవీఎం, వీవీప్యాట్ అవగాహన కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఏనుమాముల గోదాముల్లోని శిక్షణ కోసం భద్రపరిచిన రిజర్వ్ ఈవీఎం యంత్రాల్లో 8 యంత్రాలను వీవీ ప్యాట్‌లను తీసి ఆయా నియోజకవర్గ ఈఆర్‌వోలను కేటాయించామన్నారు. కలెక్టర్ కార్యాలయంతోపాటు జిల్లాలోని నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారుల కార్యాలయం పరిధిలోని జీడబ్ల్యూఎంసీ, నర్సంపేట తహసీల్దారు కార్యాలయం, వర్ధన్నపేట బస్ స్టేషన్‌లో అవగాహన కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలోని ముఖ్యమైన ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తామన్నారు. ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవడం మన హక్కు అని, ఈవీఎం, వీవీప్యాట్‌ల ద్వారా ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలనే దానిపై జిల్లాలోని ప్రతీ పోలింగ్ కేంద్రం పరిధిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆమె వెల్లడించారు. కార్యక్రమంలో ఆర్డీవో వాసుచంద్ర, స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి, డీపీఆర్‌వో అయూబ్ అలీ, ఏవో శ్రీకాంత్, ఇన్ఫార్మటిక్స్ అధికారి అప్పిరెడ్డి, పర్యవేక్షకులు ఆదినారాయణ, జగదీష్, సదానందం, రమేష్, కలెక్టర్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సోషియాలజీలో సాంబశివరావుకు డాక్టరేట్



కేయూ క్యాంపస్, జనవరి 30: కేయూ సోషియాలజీ విభాగం పరిశోధకుడు తమ్మిశెట్టి సాంబశివరావు డాక్టరేట్ సాధించారు. ఈ మేరకు మంగళవారం సాంబశివరావుకు డాక్టరేట్ ప్రకటించినట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి ప్రకటించారు. ప్రాబ్లమ్స్ అండ్ ప్రాస్పెక్టర్స్ ఆఫ్ డిసబులిటీ స్టూడెంట్స్ ఇన్ హైయర్ ఎడ్యుకేషన్ - ఏ స్టడీ ఇన్ ఖమ్మం డిస్ట్రిక్టు ఆఫ్ తెలంగాణ స్టేట్ అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని సమర్పించినందుకుగాను డాక్టరేట్ లభించింది. సోషియాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ కుంట అయిలయ్య పర్యవేక్షణలో సాంబశివరావు పరిశోధన గ్రంథాన్ని రూపొందించారు. కొత్తగూడెం జిల్లా మణుగూరు మండలం బాపంకుంటకు చెందిన దివ్యాంగుడైన సాంబశివరావు 70పైగా సినిమా పాటలు, 11 సినిమా కథాలను రాశారు.

సాహిత్యంలోనే సామాజిక చైతన్యం

● వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ● కేయూలో రెండు రోజుల జాతీయ సదస్సు



మాట్లాడుతున్న కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్

కేయూ క్యాంపస్, జనవరి 30: సాహిత్యంతోనే సమాజంలో చైతన్యం పరిఢవిల్లుతుందని కాకతీయ యూనివర్సిటీ వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ఉద్బోధించారు. మంగళవారం కేయూ, వల్లంపట్ల ఆర్ట్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ సంయుక్తంగా తెలుగు విభాగాధిపతి ప్రొఫెసర్ బన్న అయిలయ్య అధ్యక్షతన వల్లంపట్ల సాహిత్యం- సామాజిక చైతన్యం' అనే అంశంపై రెండు రోజుల సదస్సు ప్రారంభమైంది. ఈ సందర్భంగా కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో జరిగిన సదస్సుకు వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు. సాహిత్యం ప్రజలను దగ్గర చేస్తోందని, తద్వారా సామాజిక చైతన్యం వస్తుందన్నారు. గొప్ప చైతన్య శీలి, ఆచరణ వాది, బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు అని చెప్పారు. వల్లంపట్ల ప్రభుత్వ కార్యక్రమాలను కళారూపాలతో ప్రజలల్లోకి తీసుకువచ్చి చైతన్య పరిచారని అన్నారు. హేతుబద్ధత గీటు రాయి అన్నారు. వాదాలు ఏమైనా దానికి వేదిక తెలుగు విభాగం అవుతోందని చెప్పారు. వర్సిటీలో జరుగున్న పరిశోధన క్రమాన్ని కొనియాడారు. పరిశోధన పట్ల వల్లంపట్ల జీవితాన్ని తీసుకోవడం, ఇతర గొప్ప వ్యక్తుల జీవితాన్ని పరిశోధన అంశంగా తీసుకోవడం నూతన ప్రక్రియని చెప్పారు. సాహిత్యంపై చర్చలో సామాజిక చైతన్యం సాధ్యం అవుతోందని అన్నారు.

విశిష్ట అతిథిగా హాజరైన డాక్టర్ బీఎస్‌రాములు మాట్లాడుతూ.. సామాజిక రుగ్మతలను రూపుమాపేందుకు 5 దశాబ్దాలుగా తన కలాన్ని, గళాన్ని అర్పించిన నాగేశ్వర్‌రావు గొప్పవారిని చెప్పారు. సదస్సులో ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ రతన్‌సింగ్ ఠాకూర్, కవయిత్రి, రచయిత అనిశెట్టి రజిత, ప్రొఫెసర్ పి.కృష్ణమాచారి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, కామర్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్.నరసింహచారి, బీవోఎస్ చైర్మన్ ప్రొఫెసర్ కట్ల రాజేందర్, ప్రొఫెసర్ పి.వరలక్ష్మి, డాక్టర్ తాళ్ళపల్లి యాకమ్మ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో హనుమకొండ వాసి



గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో శ్రేష్ఠ

హనుమకొండ కల్చరల్, జనవరి 30: హనుమకొండ కొత్తూరు జెండా ప్రాంతానికి చెందిన పాసికంటి శ్రీశ్రేష్ఠ ఇటీవల న్యూఢిల్లీలో జరిగిన గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో పాల్గొంది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి మొత్తం 10 మంది విద్యార్థులు ఎంపిక కాగా, తెలంగాణ నుంచి ఎంపికైన అత్యంత చిన్న వయస్కురాలు కావడం విశేషం. నగరంలోని కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్‌సీ చదువుతున్న శ్రేష్ఠ. నెల రోజులుగా న్యూఢిల్లీలో జరుగుతున్న క్యాంపులలో పాల్గొంటోంది. సాంస్కృతిక కార్యక్రమాలు, యోగా పరేడ్ ప్రత్యేక కవాతులో ఆమె శిక్షణ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీని కలిసి అవకాశం, ఆయన ముందు జరిగిన కార్యక్రమంలో పాల్గొనడం విశేషం.

తునికాకు సేకరణకు టెండర్లు వేయాలి..

ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్

మహబూబాబాద్, జనవరి 30 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2024 సీజన్‌లో తునికాకు సేకరణకు కాంట్రాక్టర్లను ఆహ్వానించి టెండర్లు వేసి ప్రూనింగ్ పనులు చేపట్టాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి, అజ్ఞాత దళకమాండర్ అశోక్ డిమాండ్ చేశారు. ఆయనపేరిట మంగళవారం ఆంధ్రజ్యోతి కార్యాలయానికి పంపిన లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. 50 ఆకులతో కూడిన కట్టకు రూ.5 ప్రభుత్వం ధరను నిర్ణయించాలన్నారు. కొన్నేళ్లుగా పెండింగ్‌లోఉన్న బోనస్‌ను ఆకు సేకరణ పనులకు ముందే చెల్లించాలని పేర్కొన్నారు. తునికాకు కూలీలకు రావాల్సిన బోనస్ డబ్బుల చెల్లింపుల్లో అవకతవకలు, అవినీతి అక్రమాలు జరిగినట్లు వెలుగులోకి వచ్చాయని, వీటిపై సమగ్ర విచారణ జరిపి అవినీతికి పాల్పడిన వారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తునికాకు రేటును పెంచడం ద్వారా కూలీలు ఆకు టార్గెట్‌ను పూర్తి చేయడంతో పాటు కూలీలకు, ప్రభుత్వానికి, కాంట్రాక్టర్లకు ఆదాయం పెరుగుతుందన్నారు. బహుళ ఆదాయాలకు అవకాశాలు ఉన్న తునికాకు టెండర్లను త్వరగా పూర్తి చేయాలని ఎన్డీ రాష్ట్ర కార్యదర్శి అశోక్ డిమాండ్ చేశారు.

నర్సంపేట మునిసిపాలిటీలో వీగిన అవిశ్వాసం

● కోరం లేక వీగిన తీర్మానం ● చైర్మన్ పదవిని నిలబెట్టుకున్న గుంటి రజని



నర్సంపేట మునిసిపాలిటీ అవిశ్వాస సమావేశానికి కౌన్సిలర్లు హాజరుకాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు



కోరం లేక అవిశ్వాసం వీగిపోయిందని వివరిస్తున్న ఆర్డీవో కృష్ణవేణి, వేదికపై కమిషనర్ వెంకటస్వామి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపల్ చైర్‌పర్సన్ గుంటి రజనీని పదవి నుంచి తొలగించాలనే ఉద్దేశంతో బీఆర్ఎస్ కౌన్సిలర్లు వేసిన పాచిక పారలేదు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన చైర్‌పర్సన్‌పై ఇదే పార్టీకి చెందిన 13 మంది కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు వీగిపోయింది. మంగళవారం మునిసిపల్ కార్యాలయంలోని సమావేశ గదికి కమిషనర్ నాయిని వెంకటస్వామితో కలిసి ప్రత్యేక అధికారి స్థానిక ఆర్డీవో కృష్ణవేణి చేరుకున్నారు. షెడ్యూల్ సమయం 11 గంటల వరకు చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు మద్దతు పలికిన మరో కౌన్సిలర్ హాజరవుతారని అందరూ భావించారు. కానీ అంచనాలు తలకిందులై 12గంటల వరకు ఏ ఒక్క కౌన్సిలర్ హాజరుకాలేదు. ఆ తర్వాత ప్రత్యేక అధికారి అవిశ్వాస పరీక్షకు మధ్యాహ్నం 2గంటల వరకు వాయిదా వేశారు.

మునిసిపాలిటీలో 24 వార్డులు ఉన్నాయి. ఇందులో 18వార్డుల్లో బీఆర్ఎస్ కౌన్సిలర్లు ఉండగా ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. దీనికి తోడు ఎమ్మెల్యేతో కలిసి 25 మంది సభ్యులు అవుతారు. ఇందులో ఆరుగురు కాంగ్రెస్ కౌన్సిలర్లను అవిశ్వాసానికి దూరంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. ఆయనతో పాటు కాంగ్రెస్ కౌన్సిలర్లు అవిశ్వాస సమావేశానికి దూరంగా ఉన్నారు. మిగిలిన 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో అవిశ్వాసం పెట్టిన 13 మందితోపాటు వీరికి మద్దతునిచ్చిన మరో కౌన్సిలర్ సమావేశానికి హాజరుకాలేదు. అవిశ్వాసానికి వ్యతిరేకించిన నలుగురు కూడా సమావేశానికి హాజరు కాకపోవడంతో అవిశ్వాసం వీగి పోయినట్లు ప్రత్యేక అధికారి, ఆర్డీవో కృష్ణవేణి ప్రకటించారు.



నర్సంపేట మునిసిపల్ కార్యాలయం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్సై రవి, సిబ్బంది

హాజరుకాని చైర్‌పర్సన్

పట్టణంలోని మునిసిపల్ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం పెట్టిన 13 మంది కౌన్సిలర్లతోపాటు మద్దతు ఇచ్చిన మరో కౌన్సిలర్ కలిసి 14 మంది కౌన్సిలర్లు హాజరయ్యారు. మరో ముగ్గురు కౌన్సిలర్ల మద్దతు లేనిదే అవిశ్వాసం నెగ్గే పరిస్థితి లేదని గ్రహించి సమావేశానికి చైర్‌పర్సన్ గైర్హాజరయ్యారు. మిగిలిన నలుగురిలో ఒకరు నర్సంపేటలోనే ఉండగా మరో ఇద్దరు కౌన్సిలర్లు(దార్ల రమాదేవి, ఎండి. పాషా) మూడు రోజుల క్రితం చైర్‌పర్సన్ రజనికి మద్దతుగా క్యాంపునకు వెళ్లారు. 18మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లలో 17మంది మద్దతు అవసరం ఉంది. అవిశ్వాసానికి మద్దతునిచ్చిన 14మంది కౌన్సిలర్లకు చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలన్న అవిశ్వాసం నెగ్గక చుక్కెదురైంది. తోటి కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం నుంచి బయట పడడానికి ఇద్దరు కౌన్సిలర్లతో కలిసి క్యాంప్‌కు వెళ్లిన చైర్‌పర్సన్ గుంటి రజని చైర్మన్ స్థానాన్ని నిలబెట్టుకుంది. దీంతో చైర్‌పర్సన్‌ను పదవి నుంచి తొలగించాలని భావించి అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టిన 14 మంది కౌన్సిలర్ల ఆలోచన బెడిసి కొట్టింది. అవిశ్వాసం వీగి పోవడంతో వారిలో నిరాశ చోటు చేసుకుంది.

అవిశ్వాస అంశానికి తెర

గత నెల రోజులుగా కొనసాగుతున్న మునిసిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాసం తీర్మానం పెట్టిన అంశానికి సోమవారం అవిశ్వాసం వీగి పోవడంతో తెరపడినట్లయింది. చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి 14మంది కౌన్సిలర్లు మద్దతు పలుకగా నలుగురు అవిశ్వానికి వ్యతిరేకంగా ఉన్నారు. 17మంది కౌన్సిలర్ల బలం ఉంటేనే అవిశ్వాసం నెగ్గేది. అయితే ఆ 14 మందికి నలుగురు సహకరించక పోవడం, వీరికి కాంగ్రెస్ కౌన్సిలర్లు కూడా సహకరించకుండా అవిశ్వాసానికి దూరంగా ఉండడంతో కోరం లేక వీగిపోయింది.

బీఆర్ఎస్ పార్టీకి 14 మంది కౌన్సిలర్ల రాజీనామా

మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడి



నర్సంపేటలో తోటి కౌన్సిలర్లతో కలిసి రాజీనామా చేస్తూ వ్రాసిన పత్రాన్ని చూపుతున్న వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి

నర్సంపేట, జనవరి 30 : వరంగల్ జిల్లా నర్సంపేట మునిసిపాలిటీకి చెందిన 14 మంది బీఆర్ఎస్ కౌన్సిలర్లు బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు మునిసిపల్ వైస్ చైర్మన్ మునుగాల వెంకట్‌రెడ్డి వెల్లడించారు. నర్సంపేటలోని సర్వాపురంలో 14మంది కౌన్సిలర్లు మంగళవారం మీడియా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. చైర్‌పర్సన్ ఒంటెద్దు పోకడలు నచ్చక ఏడాది కిందట అవిశ్వాసం పెట్టాలని నిర్ణయానికి వచ్చామన్నారు. అయితే జనవరి 30వ తేదీవరకు అవకాశం లేదని తెలిసి అప్పుడు ఆలోచనను విరమించుకున్నామన్నారు. అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక ఇదే విషయాన్ని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా అయన మాట్లాడుతానని హామీ ఇచ్చారన్నారు. అయినా చైర్‌పర్సన్, కౌన్సిలర్ల మధ్య సమన్వయం చేయకపోవడంతో జనవరి 2న కలెక్టర్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానపత్రాన్ని ఇచ్చామన్నారు. రెండు రోజుల కిందట క్యాంపునకు వెళ్లిన కౌన్సిలర్లతో మాట్లాడి సమన్వయం చేస్తానని చెప్పి 15మంది కౌన్సిలర్లతో విప్ పత్రాలపై సంతకాలు చేయించుకున్నారని ఆరోపించారు. ముగ్గురిని పిలిపించి విప్ పత్రంపై సంతకాలు చేయించకపోవడం.. ఇచ్చిన మాటను సుదర్శన్‌రెడ్డి తప్పడంతో మనస్తాపానికి గురైన 14 మంది కౌన్సిలర్లు.. పార్టీకి రాజీనామా చేస్తున్నామని ప్రకటించారు. తమ రాజీనామా లేఖను బీఆర్ఎస్ పట్టణ పార్టీ అధ్యక్షుడు నాగెల్లి వెంకటనారాయణ ద్వారా మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి పంపిస్తామన్నారు. 14 మంది కౌన్సిలర్లలో ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన వారు ఎవరూ లేరన్నారు. డబ్బులు ఆశించిన వారు, భూములను కబ్జా చేసిన వారు లేరన్నారు. ప్రజల వద్ద కౌన్సిలర్లు డబ్బులు వసూలు చేస్తే మునిసిపాలిటీలో పనులు అవుతాయా ఆలోచించాలన్నారు. చైర్‌పర్సన్‌అసమర్థతతోనే కోట్లాది రూపాయల నిధులున్నా... వార్డుల్లో అభివృద్ధి పనులు జరగలేదన్నారు. ఇప్పుడు నిధులు మురిగిపోయే అవకాశాలు ఉన్నాయని వెంకట్‌రెడ్డి వాపోయారు.

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డిపై సూచన మేరకు విప్‌పై తాము సంతకాలు చేశామని, అయితే సంతకాలు చేయని చైర్‌పర్సన్, ఇద్దరు కౌన్సిలర్లపై ఎలాంటి చర్యలు తీసుకోక పోవడంతో పార్టీకి రాజీనామా చేస్తున్నామని వెల్లడించారు. ఒకటి రెండు రోజుల్లో ఆలోచించి కౌన్సిలర్ పదవులకు సైతం రాజీనామా చేయాలనుకుంటున్నామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు రుద్రమల్లీశ్వరి, గంప సునీత, వేల్పుగొండపద్మ, బానాల ఇందిర, దేవోజు తిరుమల, రామసహాయం శ్రీదేవి, గందె రజిత, శీలం రాంబాబు, మినుముల రాజు, బోడ గోల్యానాయక్, జుర్రురాజు ఇతర కౌన్సిలర్లుతోపాటు నాయకులు నాగిశెట్టి ప్రసాద్, రుద్ర ఓం ప్రకాశ్, గందె చం ద్రమౌళి. సుధాకర్‌రెడ్డి, దేవోజు సదానందం తదితరులు పాల్గొన్నారు.

నేను రాజీనామా చేయడం లేదు: పద్మరాజు

తాను బీఆర్ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేయలేదని కౌన్సిలర్ వేల్పుగొండ పద్మరాజు మంగళవారం సోషల్ మీడియాలో వెల్లడించారు. అంతకుముందు మునిసిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి 14 మందితో నిర్వహించిన మీడియా సమావేశంలో పాల్గొన్న పద్మరాజు.. సమావేశం అనంతరం తాము బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేయడం లేదని, పార్టీలోనే కొనసాగుతామని వెల్లడించడం కొసమెరుపు. దీంతో 13 మందే రాజీనామా చేసినట్లు భావించాల్సి ఉంటుంది. వీరిలో కూడా ఇంకా ఎవరైనా మనసు మార్చుకుంటారా అన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి

దొంగతనం కేసులో నలుగురు అరెస్టు

● రూ.1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ ● ఆటో సీజ్



నర్సింహులపేట ఠాణాలో వివరాలు వెల్లడిస్తున్న సీఐ సత్యనారాయణ

నర్సింహులపేట, జనవరి 30: నర్సింహులపేట, తొర్రూరు, మరిపెడ మండలాల్లో దొంగతనాలకు పాల్పడుతున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసి, రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తొర్రూరు సీఐ సత్యనారాయణ తెలిపారు. నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వివరాలను వెల్లడించారు. నర్సింహులపేట మండలంలోని ముంగిమడుగు ఫకీరతండాకు చెందిన భూక్య హరికృష్ణ, గుగులోతు గణేష్, గుగలోతు సుమన్, గుగులోతు కళ్యాణ్‌లు ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ఈ నెల 10న మండలంలోని వంతడుపల తండాకు చెందిన ధరావత్ రూప్‌సింగ్ తన ఇంటి ఎదుట కట్టేసిన మేకపోతును ఎవరో గుర్తుతెలియని వారు ఎత్తుకుపోయారని నర్సింహులపేట పోలీస్‌స్టేషన్‌లో ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన ఎస్సై సతీష్ విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో మంగళవారం ఉదయం నర్సింహు లపేట శివారు జయపురం క్రాస్‌రోడ్డువద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆటోలో 5 మేకలు, 4 గొర్రెలతో నలుగురు వ్యక్తులు అనుమానస్పదంగా కనిపించారు. అదుపులోకి తీసుకొని విచారణ చేయగా మరిపెడ మండలంలోని కస్నాతండా, తొర్రూరు మండలంలోని ఫత్తేపురం, నర్సింహు లపేట మండలంలోని వంతడుపల తండాలో చోరీలకు పాల్పడి గొర్రెలు, మేకలు అపహరించి మార్కెట్‌లో విక్రయాలు జరిపినట్లు నిర్ధారణ జరిగింది. నిందితుల నుంచి రూ. 1.50 లక్షల విలువైన గొర్రెలు, మేకలు రికవరీ చేయడంతో పాటు చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. నిందితులను తొర్రూరు కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. దొంగతనం చేసును చేదించిన ఎస్సై సతీష్, ఏఎస్సై వెంకన్న హెడ్‌పీసీ సంతోష్, రమేష్, వెంకన్న, శ్రీను, ఎం.రమేష్‌లను తొర్రూరు డీఎస్పీ వెంకటేశ్వరబాబు, సీఐ సత్యనారాయణ అభినందించి రివార్డు అందజేశారు.

40 కిలోల గంజాయి పట్టివేత

విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలింపు ● మానుకోట రైల్వేస్టేషన్‌లో పట్టివేత



గంజాయి వివరాలను వెల్లడిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్రబాబు


నెహ్రూసెంటర్, జనవరి 30 : విశాఖపట్టణం నుంచి మహారాష్ట్రకు తరలిస్తున్న 40 కిలోల గంజాయిని పట్టుకున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఉమ్మడి వరంగల్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ నాగేంద్ర బాబు తెలిపారు. మహబూబాబాద్ ఎక్సైజ్‌స్టేషన్‌లో మంగళవారం విలేకరుల సమావేశ ంలో కేసు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన మెగా రాజేందర్‌రొంకడే అనే మహిళ, అదే ప్రాంతానికి చెందిన విజయ్‌భరత్ సద్వార్తేలు గత కొంతకాలంగా విశాఖపట్టణం నుంచి మహారాష్ట్ర, తెలుగు రాష్ట్రాల్లోని ఇతర జిల్లాలకు ఎగుమతి చేస్తున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు రూట్‌వాచ్ నిర్వహిస్తుండగా మంగళవారం తెల్లవారు జామున మహబూ బాబాద్ రైల్వేస్టేషన్‌లో కోణార్క్ ఎక్స్‌ప్రెస్ తనిఖీలు చేపట్టగా 40 కిలోల గంజాయి పట్టుబడినట్లు పేర్కొన్నారు. ఇందుకు బాధ్యులైన ఇరువురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారి బాదావత్ కిరణ్‌నాయక్, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాస్, రజిత, చిరంజీవి, మౌనిక, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ముఖం కడుక్కుంటుండగా నల్లాకు విద్యుత్ సరఫరా

విద్యుదాఘాతంతో గడ్డిగూడెంలో వ్యక్తి మృతి



భూక్య శ్రీను మృతదేహం



భూక్య శ్రీను

మహబూబాబాద్ రూరల్, జనవరి 30 : విద్యుదాఘాంతో వ్యక్తి మృతిచెందిన సంఘటన మహబూబాబాద్ మండలం గడ్డిగూడెంతండాలో మంగళవారం ఉదయం చోటు చేసుకుంది. మానుకోట రూరల్ హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం.. గడ్డిగూడెంతండాకు చెందిన భూక్య శ్రీను (40)తనకున్న 20 గుంటల భూమిని సాగు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. మంగళవారం ఉదయం నిద్రలేచి ముఖం కడుక్కునేందుకు ఇంట్లోని నల్లా వద్దకు వెళ్లి ఇనుముతో ఉన్న నల్లా ట్యాప్‌ను పట్టుకున్నాడు. నల్లాకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురై భూక్య శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య మంగొని, తల్లి ద్వాలీ ఉన్నారు. భార్య మంగొని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకన్న తెలిపారు.

విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్యకు పాల్పడ్డ ఉదిత్

లింగాలఘణపురం, జనవరి 30: లింగాలఘణపురం మండల కేంద్రానికి చెందిన ఏదునూరి ఉదిత్(15) అనే పదో తరగతి చదువుతున్న విద్యార్థి మంగళవారం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ ఏదునూరి కృష్ణ-రజితల కుమారుడు ఉదిత్ లింగాలఘణపురం టీఎస్ఎంఎస్‌లో పదో తరగతి చదువుతున్నాడు. ఈక్రమంలో ఇంటి పక్కనే ఉన్న గొర్రెలదొడ్డిలో మంగళవారం ఉదయం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు గ్రామస్థులు తెలిపారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. అయితే రెండు రోజుల క్రితం తన స్నేహితులతో తాను ఒకట్రెండురోజుల్లో చనిపోతానని తన అంతిమయాత్రలో డీజే పెట్టాలని చెప్పినట్లు చర్చ జరుగుతోంది. దీంతో అతని కోరిక మేరకు డీజే ఏర్పాటు చేసి అంతిమయాత్రను నిర్వహించడం గమనార్హం.

నలుగురు డీఎస్పీలకు స్థానచలనం

హనుమకొండ క్రైం, జనవరి 30: తెలంగాణ రాష్ట్ర మల్టీజోన్‌లో పనిచేస్తున్న నలుగురు డీఎస్పీలకు స్థానచలనం కలిగిస్తూ రాష్ట్ర డీజీపీ రవిగుప్తా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. బి.గంగాధర్ పీటీసీ కరీంనగర్ నుంచి వరంగల్‌కు, కె.నాగయ్య వరంగల్ నుంచి పీటీసీ, ఎం.శ్రీనివాస్ వరంగల్ నుంచి డీఏఆర్, ఎస్. సురేంద్ర వరంగల్ నుంచి రామగుండంలకు పోస్టింగ్‌లు కల్పిస్తూ డీజీపీ ఆదేశాలు జారీ చేశారు. బదిలీ అయిన వారు ఒకటి రెండు రోజుల్లోవిధుల్లో చేరాలని ఆదేశించారు.



మోదీ పాలనకు చరమగీతం పాడాలి: ఎంసీపీఐ(యు)



మాట్లాడుతున్న పెద్దారపు రమేష్

గిర్మాజిపేట, జనవరి 30 : ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశంలో ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛ, హక్కులు ప్రమాదంలో పడ్డాయని ఎంసీపీఐ(యు) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ ఆరోపించారు. మంగళవారం వరంగల్ హెడ్‌పోస్టాఫీసు సెంటర్ సమీపంలోని ఓంకార్ భవన్‌లో పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి నర్రా ప్రతాప్ అధ్యక్షతన కమ్యూనిస్టు కో ఆర్డినేషన్ కమిటీ, ఎంసీపీఐ (యు) ఆధ్వర్యంలో మనువాద ముప్పు-లౌకిక శక్తుల పాత్రపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఇందులో రమేష్ మాట్లాడుతూ బీజేపీని రానున్న ఎన్నికల్లో ఓడించాలన్నారు. సమావేశంలో వివిధ ప్రజాసంఘాల నాయకులు మంద రవి, కుసుంబ బాబురావు, కొమురయ్య, నగేష్, మల్లికార్జున్, గోవర్ధన్ రాజు,ప్రేమలత, అనుష, రేణుక పాల్గొన్నారు.

సమ్మె నోటీస్ అందజేసిన ఆల్‌ట్రేడ్ యూనియన్స్ ప్రతినిధులు



మార్కెట్ కార్యదర్శి సంగయ్యకు సమ్మె నోటీస్ అందజేస్తున్న కార్మిక సంఘాల నేతలు

వరంగల్‌టౌన్, జనవరి 30: ఫిబ్రవరి 16న కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపులో భాగంగా దేశవ్యాప్తంగా సమ్మెకు పిలుపునిచ్చిన నేపథ్యంలో భాగంగా మంగళవారం జిల్లా ఆల్‌ట్రేడ్ యూనియన్స్ అసోసియేషన్ ప్రతినిధుల బృందం ఏనుమాముల మార్కెట్ కార్యదర్శి సంగయ్యను కలిసి సమ్మె నోటీస్ అందజేశారు. ఏనుమాముల మార్కెట్ ఫిబ్రవరి 16న సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి గంగుల దయాకర్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం పదేళ్లుగా కార్మికులు, రైతులు సామాన్య ప్రజలకు వ్యతిరేకంగా ప్రజల హక్కుల ఉల్లంగణకు పాల్పడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు గన్నారపు రమేష్, ఫుల్లా రమేష్, ఎస్.జగదీశ్వర్, ఎండి.ఖాసీం, జ్ఞానేందర్, చెన్న కేశవులు, సుధాకర్, పాషా వేణుగోపాల్ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతను పాటించాలి

సంగెం, జనవరి 30 : రోడ్డు భద్రత నియమాలను ప్రతీ ఒక్కరు పాటించాలని ఆర్టీఏ రమేష్ రాథోడ్ అన్నారు. మంగళవారం వరంగల్‌లోని ఆర్టీఏ కార్యాలయంలో రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం అందించిన మార్గదర్శకాలను పాటించి భద్రతగా ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంవీఐలు కోల రవీందర్, శాలినీ పాల్గొన్నారు.

'పార్క్'కు షాక్

5వ పేజీ తరువాయి

ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో పీఎం మిత్ర పథకం కింద అదనపు నిధులు వచ్చే అవకాశాలు లేనట్టు స్పష్టమవుతోంది.

ఎస్‌పీఏలో జాప్యం

కేంద్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం టెక్స్‌టైల్‌పార్క్ ఏర్పాటులో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీఏ) జాయింట్ వెంచర్ కింద ప్రభుత్వ ప్రైవేటు భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది చేస్తేనే పీఎం మిత్ర కిందకు పార్క్ వచ్చినందువల్ల గ్రీన్‌ఫీల్డ్ హోదా లభించేందుకు అవకాశం ఉంది. అప్పుడే కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎస్‌పీఏ ఏర్పాటులోనే తీవ్ర జాప్యం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చేనేత జౌళి శాఖ అధికారులు ఎస్‌పీఏ, జాయింట్ వెంచర్ బాడీ ఏర్పాటు దిశగా కసరత్తు మొదలు పెట్టారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి రెండుమూడు నెలలు పట్టువచ్చునని తెలుస్తోంది. ఇది పూర్తయిన తర్వాత గ్రీన్‌ఫీల్డ్ హోదా కోసం తాజాగా ప్రతిపాదనలు సమర్పించనున్నారు. ఒకసారి గ్రీన్‌ఫీల్డ్ హోదా లభించిన తర్వాత యేటా కేంద్ర బడ్జెట్‌లో పార్క్‌కు రూ.500.కోట్ల వరకు కేటాయింపు జరుగుతుంది.

మహాత్మగాంధీకి నివాళి

మహాత్ముడి చిత్రపటాలు, విగ్రహాలకు నివాళి

గిర్మాజిపేట, జనవరి 30: జాతిపిత మహాత్మాగాంధీ వర్ధంతి పురస్కరించుకుని అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం వరంగల్ రైల్వే స్టేషన్ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ నాయకుడు మీసాల ప్రకాష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంద శ్రీనివాస్, బండి సుధాకర్, రామకృష్ణ, విశాల్ బాబు, అన్వేష్, జస్వీర్ సింగ్, సరళాదేవి, శ్రీలత, విజయలక్ష్మి, శారద పాల్గొన్నారు.



మరియపురంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న బాలిరెడ్డి



ఆరెపల్లిలో మహాత్మగాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న జ్వాల ప్రతినిధులు

- పోచమ్మమైదాన్ : గ్రేటర్ వరంగల్ మూడో డివిజన్ ఆరెపల్లిలో మంగళవారం జ్వాల అవినీతి వ్యతిరేక స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహాత్మ గాంధీ వర్ధంతిని నిర్వహించారు. జ్వాల వ్యవస్థాపక అధ్యక్షుడు సుంకరి ప్రశాంత్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.
- ఖిలావరంగల్: కాంగ్రెస్ 34వ, డివిజన్ అధ్యక్షుడు చిట్టిమళ్ల శ్రీనివాస్ రావు శివనగర్‌లో గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కా ర్యక్రమంలో కాంగ్రెస్ మహిళా నాయకులు కొనకం చి కృష్ణకుమారి, పంచరాని స్రవంతి,తూ పురాణి మాధవి, బోడకాని సరిత, దోమల శ్రీలత, శిరీష, బత్తుల సుధా, కవిత, హరిత, లక్ష్మి, స్నేహ, వెంకటే శ్వర్లు, జ్యోతి, పాల్గొన్నారు.
- గీసుగొండ: జాతీయ ఆదర్శ గ్రామాలైన మరియపురం, గంగదేవిపల్లిలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు అల్లం బాలిరెడ్డి, గోనె మల్లారెడ్డి బాపూజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్యదర్శులు స్వప్న, తపస్విని, గ్రామస్థులు పాల్గొన్నారు. గీసుగొండలో కాంగ్రెస్ పార్టీ యూత్ అధ్యక్షుడు ఆకుల రుద్రప్రసాద్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు చాడా కొమురారెడ్డి, దూలం వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



రైల్వే స్టేషన్ రోడ్డులో గాంధీ విగ్రహానికి పూలమాల వేస్తున్న కాంగ్రెస్ నేత మీసాల ప్రకాష్

- ఏకశిలానగర్: మహాత్మా జ్యోతిభాపూలే జాతీయ అవార్డు గ్రహీత గోగికార్ రవీందర్ కరీమాబాద్‌లోని లక్ష్మీనగర్ పోచమ్మగుడి వద్ద గల మహాత్ముడి విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పిట్టా రాజేంద్రప్రసాద్, కటకం సాంబయ్య, టింగిలికార్ సతీష్, బూట్ల నాగరాజు, శోభ, పిన్నింటి రామస్వామి పాల్గొన్నారు.

టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాల అవకాశాలను కలిపిస్తాం

కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కుపై సమీక్షాలో ఎమ్మెల్యే రేవూరి

సంగెం, జనవరి 30: కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఉద్యోగాలను ఈప్రాంత నిరుద్యోగులకు కలిపించేందుకు కృషి చేస్తామని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్‌రెడ్డి చెప్పారు. మంగళవారం హనుమకొండలోని గెస్టుహౌస్‌లో వరంగల్ ఆర్డీవో వాసుచంద్ర, సంగెం, గీసుగొండ తహసీల్దార్‌లు రాజ్‌కుమార్, రియాజుద్దిన్, ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డిలతోపాటు పలువురు అధికారులతో పనుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సంగెం- గీసుగొండ మండలాల పరిధిలో టెక్స్‌టైల్స్ పార్కు ఏర్పాటు కోసం సేకరించిన భూముల్లో రైతుల నుంచి కొనుగోలు చేసిన వాటితోపాటు ప్రభుత్వ భూముల వివరాలను అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పార్కులో పనులు నత్తనడకగా సాగుతున్నాయని వాటిని వెంటనే పనులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని చెప్పారు. గత ప్రభుత్వం సేకరించిన భూముల్లో ఇప్పటి వరకు ఫ్యాక్టరీలు ఎన్ని నిర్మాణ పనులు పూర్తి చేశారని, పురోగతిలో ఉన్న వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పూర్తి స్థాయిలో పనులు పూర్తి చేయడం వలన భూములు కోల్పోయిన వారి కుటుంబాలకు ఉద్యోగ అవకశాలను కలిపించేందుకు ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెడుతుందన్నారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కును వచ్చేనెల 8న సందర్శించి యూనిట్లను పరిశీలించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గీసుగొండ ఎంపీపీ భీమగాని సౌజన్య పాల్గొన్నారు.



మెగా టెక్స్‌టైల్ పార్కుపై సమీక్షా నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రేవూరి

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

మట్టెవాడ, జనవరి 30 : వరంగల్ ట్రాఫిక్ పోలీసుస్టేషన్ పరిధిలోని డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలుశిక్ష విధిస్తూ వరంగల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ గుర్రపు వీరస్వామి మంగళవారం తీర్పును ఇచ్చినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ వెంకన్న తెలిపారు. మద్యం తాగి వాహనం నడిపిన కేసులో మంద అనిల్, ఏదులాపురం శ్రీనివాస్, గుగులోతు విజయ్, రుద్రారపు నాగరాజులకు జైలు శిక్ష విధించారు. 18 మందికి రూ. 18,300 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పునిచ్చారన్నారు.

తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీవో

సంగెం, జనవరి 30 : సంగెం తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం వరంగల్ రూరల్ ఆర్డీవో వాసుచంద్ర పరిశీలించారు. ఈ సందర్భంగా ఆఫీసులోని పలు రికార్డులను పరిశీలించి అధికారులకు దిశానిర్దేశం చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణను పరిశీలించారు. కార్యాలయ వాతావరణం ఎల్లప్పుడు ఆహ్లాదకరంగా ఉండేలా చూసుకోవాలన్నారు. మొక్కలను కాపాడుతూ మంచి గాలిని అందించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజ్‌కుమార్, సూపరిండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ బాలాజీ పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రభుత్వ టీచర్లకు పదోన్నతులు కల్పించాలి



ఎమ్మెల్సీ కోదండరాంకు వినతి పత్రం ఇస్తున్న యూనియన్ నాయకులు

శంభునిపేట, జనవరి 30 : ఉన్నత విద్యార్హతలతోపాటు పీహెచ్‌డీ డాక్టరేట్‌లు పొంది ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలని తెలంగాణ రాష్ట్ర డాక్టరేట్స్ ప్రభుత్వ ఉపాధ్యాయుల యూనియన్ బాధ్యులు మంత్రి కొండా సురేఖను, ఎమ్మెల్సీ కోదండరాంలను కోరారు. మంగళవారం యూనియన్ బాధ్యులు మంత్రి, ఎమ్మెల్సీలను హైదరాబాద్‌లోని వారి కార్యాలయాల్లో కలిసి వినతి పత్రం అందించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మెర కుమారస్వామి మాట్లాడుతూ 25 సంవత్సరాలుగా ప్రభుత్వ ఉపాధ్యాయులుగా అనుభవం కలిగి డాక్టరేట్ పొందిన జీటీడీయూ సభ్యులను ప్రభుత్వ డిగ్రీ, జూనియర్, డైట్ కళాశాలల్లో, ఎస్‌సీఈఆర్టీ వంటి సంస్థల్లోకి పదోన్నతులు కల్పించాలని కోరారు. జూనియర్, డిగ్రీ కళాశాలల్లో కాంట్రాక్టు లెక్చరర్లను రెగ్యులరైజ్ చేశారన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.సత్యం, డాక్టర్ మల్లల్‌రావు, డాక్టర్ వెంకన్న పాల్గొన్నారు.

నేడు సర్పంచ్‌లకు వీడ్కోలు సమావేశం

గీసుగొండ, జనవరి 30: సర్పంచ్‌ల పదవీకాలం నేటితో ముగియనుండటంతో ఆయా గ్రామాల సర్పంచ్‌లను ఎంపీడీవో కార్యాలయంలో వీడ్కోలు సమావేశాన్ని బుధవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వీరేశం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లను సన్మానించనున్నట్లు చెప్పారు.

పన్నులు చెల్లించకుంటే రెడ్ నోటీసులు జారీ చేయండి

▸▸ అధికారులకు బల్దియా కమిషనర్ ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), జనవరి 30: ఆస్తి, ట్రేడ్ లైసెన్స్‌ల పన్నులు చెల్లించనివారికి రెడ్ నోటీసులు జారీ చేయాలని జీడబ్ల్యూఎంసీ అధికారులను కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆదేశించారు. మంగళవారం హనుమకొండలోని బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ, ప్రజారోగ్య అధికారులతో ఆయన సమీక్ష జరిపారు. పదేళ్లుగా పన్నుల వసూళ్ల విధానాన్ని ఒకే రీతిలో పాటించడం సరికాదన్నారు. మునిసిపల్ యాక్ట్100(2) మేరకు డిసెంబర్, జనవరిలోనే పన్నులు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఎవరైతే ఇందుకు విరుద్ధంగా పన్నులు చెల్లించనట్లైతే తాగునీరు, విద్యుత్ సేవలు నిలిపి వేయాలన్నారు. ఈ క్రమంలో ఈ విధానం అమలుపై దృష్టి సారించాలని సూచించారు. డిమాండ్ మేరకు పన్నుల వసూళ్లు జరగాలని, చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేసి తాగునీరు, విద్యుత్ సేవలు నిలిపి వేయాలని ఆదేశించారు. ట్రేడ్ లైసెన్స్ వసూళ్లు కూడా 46 శాతం మాత్రమే జరిగాయని కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగియడానికి మరో రెండు నెలలు మాత్రమే మిగిలి ఉన్న క్రమంలో పన్నుల వసూళ్లు వందశాతం జరగాలని స్పష్టం చేశారు. ప్రతీ బుధవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో రెవెన్యూ మేళా నిర్వహించనున్న క్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులు, సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. దీనిపై తాను సమీక్ష నిర్వహిస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్, రవీందర్ యాదవ్, సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలన

ఆస్తి, ట్రేడ్ వసూళ్ల తీరును అదనపు కమిషనర్ అనిసూర్ రశీద్ నగరంలోని వివిధ ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పన్నులు సకాలంలో చెల్లించాలని ప్రజలను కోరారు.

జంతు సంరక్షణ అందరి బాధ్యత: కలెక్టర్

జంతు సంక్షేమంపై సమీక్షా సమావేశం

వరంగల్ కలెక్టరేట్, జనవరి 30: జంతు సంరక్షణ అందరి బాధ్యతని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో జనవరి 14 నుంచి 31 వరకు జరుగుతున్న జంతు సంక్షేమ పక్షోత్సవాలను పురస్కరించుకుని సమీక్షా సమావేశం జరిగింది. కలెక్టర్ మాట్లాడుతూ.. వివిధ కారణాలతో కొందరు అధికారులు బదిలీ అయ్యారని, వారి స్థానంలో ప్రస్తుతం ఉన్న అధికారుల పేర్లను నమోదు చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. జంతువుల సరఫరా, రవాణా విషయంలో ప్రమాణాలు పాటించాలని పోలీసు, జిల్లా రవాణశాఖ అధికారిని ఆదేశించారు. జంతువులతో జాగ్రత్తలు పాటించుటకు పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పెంపుడు కుక్కలు, పక్షుల సంరక్షణకు గ్రామాల్లో కాలనీల కూడళ్లలో సిమెంట్ కుండీలను ఏర్పాటు చేసి నీళ్లను, ఏదైనా మిగిలిన ఆహారం ఉన్నట్లైతే వాటిల్లో వేస్తే వాటికి ఆహారం లభిస్తుందన్నారు. యాంటీ రేబీస్ నిర్మూలణ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం 18.710 వ్యాక్సిన్లను పంపిణీ చేసిందన్నారు. పెంపుడు కుక్కలకు, ఊర కుక్కలకు మాత్రమే వ్యాక్సిన్ వేయాలని ఆదేశించారు. పశుసంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ మాట్లాడుతూ.. కలెక్టర్ చైర్మన్‌గా, పశుసంవర్ధక శాఖ అధికారి సెక్రటరీగా వైస్ చైర్మన్‌గా డీసీపీ, మిగితా అధికారులు సభ్యులుగా మొత్తం 12మందితో ఈ కమిటీ 2019లో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

అయితే కొందరు అధికారులు వివిధ కారణాలతో అధికారులు బదిలీ అయ్యారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో డీసీపీ రవిందర్, జడ్పీ సీఈవో రాంరెడ్డి, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారి ప్రసాదరావు పశుసంవర్ధకశాఖ అధికారులు పాల్గొన్నారు.



సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ ప్రావీణ్య

వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలి: మంత్రి కొండా



బ్రహ్మోత్సవాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండా సురేఖ

మట్టెవాడ, జనవరి 30 : వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ఘనంగా నిర్వహించాలని అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. వరంగల్ రామన్నపేటలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఫిబ్రవరి 13 నుంచి 18 వరకు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ఆలయ అర్చకులు పరాశరం శ్రీనివాసచార్యులు, ఆలయ ఈఓ ఎలపాటి రత్నాకర్ రెడ్డి, నిర్వాహకులు మంత్రి కొండా సురేఖను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వాన పత్రికను అందించారు. అనంతరం ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలను ప్రసాదాన్ని మంత్రికి అందించారు.

టీపీటీఎఫ్ రాష్ట్ర విద్యా మహా సభలను జయప్రదం చేయాలి

వరంగల్ సిటీ, జనవరి 30: టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఖమ్మంలో నిర్వహిస్తున్న విద్యా వైజ్ఞానిక మహా సభలను జయప్రదం చేయాలని ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి కడారి భోగేశ్వర్ కోరారు. విద్యా మహా సభలను విజయవంతం చేయాలని కోరుతూ.. మంగళవారం వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఉపాధ్యాయులను కలుస్తూ ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా భోగేశ్వర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 11, 12 తేదీల్లో ఖమ్మంలో నిర్వహిస్తున్న రాష్ట్ర మహా సభల్లో ప్రొఫెసర్లు హరగోపాల్, కాశీం, బుర్ర రమేష్, ఎ.నర్సింహారెడ్డి, చందన చక్రవర్తి, గోపాల్ తదితరులు ప్రసింగిస్తారన్నారు. కాశిబుగ్గ నరేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మాసూంఅలీ హైస్కూల్, దేశాయిపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జడ్పీఎస్ఎస్ మామునూరు, బొల్లికుంట పాఠశాల, ఆరెల్లి బుచ్చయ్య పాఠశాల తదితర పాఠశాలల్లో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం నాయకులు వి.అజయ్‌బాబు, పూజారి మనోజ్, జె.స్వామి, యు.అశోక్, పూర్ణచందర్, రమేష్, దినేష్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించాలి : బీజేపీ



మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

పోచమ్మమైదాన్, జనవరి 30: కార్యకర్తలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రతీ ఓటరును కలుసుకోవాలని భారతీయ జనతా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి సూచించారు. దేశాయిపేట రోడ్డులోని పార్టీ కార్యాలయంలో మంగళవారం చలో అభియాన్-బస్తీ చలో అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. బీజేపీ నాయకుడు డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రేమేందర్ రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు పార్టీ బలోపేతానికి అన్ని విధాలా కృషి చేయాలన్నారు. బూత్ కమిటీ, పన్నా ప్రముఖ్, కొత్త ఓటర్ల నమోదు, గత ఎన్నికలలో బీజేపీకి వచ్చిన ఓట్లు తదితర అంశాలపై కార్యకర్తలకు దిశనిర్దేశం చేసి, పలు అంశా లను వెల్లడించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, రాష్ట్ర ఎస్సీ మోర్చా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రత్నంసతీష్‌షా, బాకం హరిశంకర్, రేసు శ్రీనివాస్, రాయబారపు కుమారస్వామి పాల్గొన్నారు.

సమ్మెను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాయిబాబా

ఏకశిలానగర్, జనవరి 30 : కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని సీఐటీయూ జాతీయ కోశాధికారి ఎం.సాయిబాబా పిలుపునిచ్చారు. మంగళవారం ఉర్సు గుట్ట వద్ద గల రామసురేందర్ భవన్‌లో జాతీయ స్థాయి వర్క్‌షాప్ నిర్వహించారు. తెలంగాణ భవన నిర్మాణ కార్మికుల ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి అధ్యక్షులు వంగురు రాములు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి సాయిబాబా ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. కార్మికుల హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ముదాం శ్రీనివాస్, కోశాధికారి ఎలుక సోమయ్య, ఉపాధ్యక్షులు డి.లక్ష్మయ్య, బి.శ్రీనివాసులు, వి.గాలయ్య, టి.ఉప్పలయ్య, గార కోటేశ్వర్‌రావు, జె.వెంకన్న, ఎ.రవి, వరంగల్ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, నారాయణ, జంగయ్య, సోములు, నరసింహారావు, రమేష్, రేణుక పాల్గొన్నారు.

కుష్టువ్యాధిని నిర్మూలించాలి

ఖిలావరంగల్, జనవరి 30: కుష్టు వ్యాధిని సమూలంగా నిర్మూళించాలని ఫిజియోథెరపిస్టు డాక్టర్ నర్సింహారెడ్డి అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ పట్టణ ఆరోగ్య కేంద్రంలో జాతీయ కుష్టు వ్యాధి నిర్మూళన, పక్షోత్సవాల కార్యక్రమంలో మాట్లాడుతూ స్పర్శ, లెప్రసీ అవగాహన ఉద్యమంలో భాగంగా ఆరోగ్య సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈనెల 30 నుంచి ఫిబ్రవరి 13వరకు, జిల్లాలోని అన్ని గ్రామాలలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు బృందాలుగా ఏర్పడి ప్రతీ ఇంటికి వెళ్లి (లెప్రసీ), కుష్టు వ్యాధికి సంబంధించిన లక్షణాలపైన పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఖిలావరంగల్ అర్బన్ వైద్యాధికారి డాక్టర్ రవిందర్, డీపీఎంవో సువార్త, డీపీఎవో, ఆరోగ్య సిబ్బంది, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు వీడ్కోలు సన్మానం

కరీమాబాద్, జనవరి 30: బదిలీపై వెళ్తున్న కరీమాబాద్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు దొనికెన శ్రీకాంత్‌కు మంగళవారం పాఠశాలలో వీడ్కోలు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు పి.రేఖ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈవో విజయ్‌కుమార్, కార్పొరేటర్ మరుపల్ల రవి పాల్గొన్నారు. ఎంఈవో మాట్లాడుతూ రాష్ట్రస్థాయిలో పాఠశాలకు గుర్తింపు తెచ్చినందుకు ప్రధానోపాధ్యాయుడు శ్రీకాంత్‌ను అభినందించారు. కార్పొరేటర్ మరుపల్ల రవి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి శ్రీకాంత్ ప్రత్యేక చొరవ చూపారన్నారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మాధవి, దుర్గం రవి, ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు వీరాచారి, రఘు, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, చక్రపాణి, శారద, అనురాధ, సుమిత్ర, వీరేంద్రప్రసాద్, రిటైర్డ్ ఉపాధ్యాయులు రాజేందర్, మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు తరాల రాజమణి, రవితేజ, సామాజిక కార్యకర్త మార్గం రాజ్‌కుమార్, సురేష్, రచన పాల్గొన్నారు.

జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలి

ఖిలావరంగల్, జనవరి 30: జాతీయస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో జాతీయ స్థాయిలో రాణించాలని ప్రధానోపాధ్యాయుడు కాట్రాజు వెంకటయ్య అన్నారు. మంగళవారం ఖిలావరంగల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మధ్యకోటలో ఇటీవల జాతీయ స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలలో ఎంపికైన విద్యార్థిని శ్రీజను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 16,17,18 తేదీల్లో నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ పట్టణంలోని గురుకుల జూనియర్ కళాశాలలో జరిగిన తెలంగాణ రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పాఠ శాలల విభాగంలో ఖిలావరంగల్ మధ్యకోటలోని 9వ, తరగతి విద్యార్థి జి. శ్రీజ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైందన్నారు. శ్రీజ ఫిబ్రవరి 3 నుంచి 6 వరకు ఛత్తీస్‌ఘడ్‌లోని ఖాటీర్‌థంలో జరిగే జాతీయస్థాయి పోటీలలో పాల్గొంటుందన్నారు.

వేంకటేశ్వర ఆలయంలో ఉచిత వైద్య శిబిరం

పోచమ్మమైదాన్, జనవరి 30: దేశాయిపేట గణేష్‌నగర్ టీచర్స్‌కాలనీలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం మహిళల కోసం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. వికాస తరంగిణి, ఆలయ కమిటీ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో ప్రముఖ గైనకాలజిస్టు డాక్టర్ బచ్చు వీణ మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సెక్రటరీ కల్లూరి రాఘవులు, కోశాధికారి బొడ్ల మోహన్ పాల్గొన్నారు.

మోకు దెబ్బ క్యాలెండర్ ఆవిష్కరణ

సంగెం, జనవరి 30 : గౌడ జన హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండలకేంద్రంలో మోకుదెబ్బ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆ సంఘం జాతీయ ప్రచార కార్యదర్శి గుళ్లపల్లి ఉమేందర్ గౌడ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు గుళ్లపల్లి శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు కత్తి రమేష్, దొమ్మటి దర్శనం, మచ్చ వెంకన్న, కుమార్, సంపత్ పాల్గొన్నారు.



సేవ చేయడం ఆనందంగా ఉంది..

వర్ధన్నపేట, జనవరి 30: ఐదేళ్లుగా ప్రజలకు సేవ చేసిన అనుభూతిని మర్చిపోలేక పోతున్నామని ఎంపీపీ అప్పారావు అన్నారు. సర్పంచులుగా ఎన్నికైన నాటి నుంచి బాధ్యతలు చేపట్టి ఇప్పటి వరకు ప్రజల మెప్పు పొందే విధంగా పూర్తిస్థాయిలో విధులు నిర్వహించినట్లు చెప్పారు. మంగళవారం వర్ధన్నపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజలక్ష్మీ అధ్యక్షతన పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ మార్గం భిక్షపతి, తహసీల్దార్ విజయ్‌సాగర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంపీపీ అప్పారావు

'మోదీ పాలనకు చరమగీతం పాడాలి'


సమావేశంలో మాట్లాడుతున్న ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్

నర్సంపేట టౌన్, జనవరి 30 : కేంద్రంలో మోదీ పాలనకు చరమగీతం పాడాలని ఎంసీపీఐ(యూ) జిల్లా కార్యదర్శి పెద్దారపు రమేష్ అన్నారు. పట్టణంలో మంగళవారం ముంచుకొస్తున్న మనువాద ముప్పు-లౌకిక శక్తుల పాత్ర అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశ ప్రజాస్వామ్యం, వ్యక్తి స్వేచ్ఛ, హక్కులు పెను ప్రమాదంలో ఉన్నాయని, ఎన్నికల లబ్ధికోసం ఫాసిజాన్ని రెచ్చగొడుతూ మళ్లీ అధికారంలోకి రావడానికి ప్రయత్నిస్తున్నారు. సమావేశంలో మంద రవి, బాబు రావు, కొంరయ్య, నాగేష్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

పెన్షనర్స్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నర్సంపేట టౌన్, జనవరి 30 : పెన్షనర్స్ అసోసియేషన్ నూతన క్యాలెండర్‌ను పట్టణంలోని సబ్ ట్రెజరీ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఏటీవో బెనర్జీ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏటీవో మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన పెన్షనర్ల సమస్యలను పరిష్కరించడం జరుగుతున్నదన్నారు. పెన్షనర్లకు క్యాలెండర్, డైరీ ఉపయోగకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కర్రు సుధీర్ బాబు, ప్రధాన కార్యదర్శి సదానందం పాల్గొన్నారు.

విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలి

▸▸ జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.సౌజన్య



సదస్సులో మాట్లాడుతున్న సౌజన్య

నర్సంపేట టౌన్, జనవరి 30 : విద్యార్థులకు రుచికరమైన భోజనం వడ్డించాలని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి డి.సౌజన్య అన్నారు. మంగళవారం పట్టణంలోని గిరిజన బాలికల, బాలుర వసతి గృహాల్లో పనిచేస్తున్న సిబ్బందికి పట్టణంలోని గిరిజన బాలుర వసతిగృహంలో ఆహారభద్రత, పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు పౌష్టికాహారం, రుచికరమైన భోజనం వడ్డించాలన్నారు. సీజనల్ వ్యాధులపై అవగాహన కలిగి వుండాలన్నారు. కార్యక్రమంలో ఫుడ్ సేఫ్టీ అధికారి ఆంజనేయులు, ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎంలు, వసతి గృహాల సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు భారీ షాక్

- ▸▸ బీఆర్‌ఎస్‌కు 14మంది కౌన్సిలర్లు, యూత్ కన్వీనర్ రాజీనామా..
- ▸▸ అనూహ్య పరిణామాలతో క్యాడర్‌లో నిరాశ
- ▸▸ పార్లమెంట్ ఎన్నికల వేళ పార్టీకి ఎదురుదెబ్బ
- ▸▸ నర్సంపేటలో గడ్డుకాలం



నర్సంపేట, జనవరి 30: నర్సంపేట బీఆర్‌ఎస్ పార్టీకి భారీ షాక్ తగిలింది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి నుంచి ఇంకా తేరుకోకముందే తాజాగా 14 మంది కౌన్సిలర్లు పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో శ్రేణులకు మింగుడుపడడం లేదు. ఓ వైపు పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కౌన్సిలర్ల మూకుమ్మడి రాజీనామాతో పార్టీ గట్టిదెబ్బే తగిలిందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు.

మునిసిపాలిటీలో ముసలం..

పట్టణంలోని 24 వార్డుల్లో 24 మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 18 మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు ఉండగా 6గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు ఉన్నారు. బీఆర్‌ఎస్ పార్టీతో అధికారమైనప్పటికీ చైర్‌పర్సన్ గుంటి రజినీ తీరుతో కొంతకాలంగా సొంత పార్టీ కౌన్సిలర్లే అసంతృప్తితో ఉన్నారు. ఈక్రమంలో ఈనెల 2న కలెక్టర్ కార్యాలయంలో చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మాన పత్రాన్ని అందజేయడంతో అసంతృప్తులు తారాస్థాయికి చేరాయి. అంతకుముందే చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం చేసే విషయాన్ని అసెంబ్లీ ఎన్నికలు ముగిశాక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన అవిశ్వాసం వద్దని నచ్చజెప్పారు. ఇలా రెండోసారి కూడా ఆయనను కోరగా కౌన్సిలర్ల మధ్య సమన్వయం కుదుర్చడంలో ఆయన విఫలమైనట్లు పార్టీలో చర్చసాగింది. తాజాగా అవిశ్వాసం నుంచి గట్టెక్కినా సొంత పార్టీ కౌన్సిలర్లే రాజీనామాకు సిద్ధమవడం మునిసిపాలిటీలో చర్చనీయాంశమైంది.

'అసెంబ్లీ' ఓటమి నుంచి తేరుకోకముందే..

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడం, నర్సంపేటలో ఆ పార్టీ అభ్యర్థి సుదర్శన్‌రెడ్డి ఓటమి పాలైన విషయం విదితమే. ప్రభుత్వం అధికారంలో కోల్పోయాక సుదర్శన్‌రెడ్డి ఓటమి బాధ నుంచి తేరుకోకముందే నివురు గప్పిన కౌన్సిలర్ల మధ్య విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఏకంగా చైర్‌పర్సన్‌పై అవిశ్వాసానికి సొంత పార్టీ కౌన్సిలర్లే ముందుకురాగా బీఆర్‌ఎస్‌కు తలనొప్పిగా మారింది. ఎలాగోలా అవిశ్వాసం వీగిపోవడంతో పార్టీకి కొంత ఊరట కలిగినా.. ఇప్పుడు ఏకంగా కౌన్సిలర్లే పార్టీకి రాజీనామా చేయడంతో పార్టీ శ్రేణుల్లో నిరాశ వ్యక్తమవుతోంది. త్వరలో పార్లమెంట్ ఎన్నికలు జరగనున్న తరుణంలో ఈ పరిణామం పార్టీలో కలవరం కలిగిస్తోంది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి 14మంది కౌన్సిలర్ల కోపాన్ని తగ్గించి రాజీనామాను ఉపసంహరించేలా చేసేందుకు ఎలాంటి బుజ్జగింపులకు పాల్పడతారోనని చర్చసాగుతోంది.

బీఆర్‌ఎస్‌కు దెబ్బమీద

యూత్ కన్వీనర్ గోగుల రాణా ప్రతాప్‌రెడ్డి తాను కూడా బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించడంతో బీఆర్‌ఎస్‌కు మరో దెబ్బ తగిలింది.

మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం: ఎమ్మెల్యే


శివాజీనగర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాధవరెడ్డి

దుగ్గొండి, జనవరి 30: కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే మహిళా సంఘాలు ఆర్థికంగా బలోపేతం కోసం కృషిచేసినట్టు ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అన్నారు. తొగర్రాయి, శివాజీనగర్, చంద్రయ్యపల్లిలో నూతన జీపీ భవనాలు, వెంకటాపురం లో రుద్రమదేవి, సూర్యోదయ గ్రామైక్య సంఘం భవనాన్ని మంగళవారం ఎమ్మెల్యే మాధవరెడ్డి ప్రారంభించారు. వెంకటాపురంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో మహిళా సంఘాలను కాంగ్రెస్ ప్రభుత్వ కాలంలో నిర్మాణం చేయడంతోపాటు కులవృత్తుల వారికి ఉపాధికోసం బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించినట్టు పేర్కొన్నారు. మహిళా సంఘాలు ఆర్థికంగా బలపడడానికి బ్యాంకులు మ్యాచింగ్ గ్రాంట్‌ను అందించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఎంపీపీ కాట్ల కోమలభద్రయ్య, సొసైటీ చైర్మన్ సుకినె రాజేశ్వర్‌రావు, సర్పంచ్‌లు ఓడేటి తిరుపతిరెడ్డి, ఉమరవీందర్, భవాని, ఇంగోలి రాజేశ్వర్‌రావు ఎంపీవో శ్రీధర్‌గౌడ్, ఏఈ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

గుడుంబా పట్టివేత

దుగ్గొండి, జనవరి 30: మర్రిపల్లి శివారులో అక్రమంగా బైక్‌పై రవాణా చేస్తున్న 10 లీటర్ల గుడుంబాను మంగళవారం పట్టుకున్నట్లు ఎక్సైజ్ సీఐ నరేశ్‌రెడ్డి వెల్లడించారు. నర్సంపేట మండలంలోని బిచ్యనాయక్ తండాకు చెందిన అజ్మీర జంపయ్య టీవీఎస్‌ఎక్సెల్ బైక్‌పై మర్రిపల్లి గ్రామానికి తీసుకొస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. గుడుంబాతోపాటు, బైక్‌లను స్వాధీనం చేసుకొని నిందితుడిని అదుపులో తీసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలి

వర్ధన్నపేట, జనవరి 30: ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు చుక్క ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎస్‌ఎఫ్‌ఐ వర్ధన్నపేట మండల కమిటీ ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ గత ప్రభుత్వం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేస్తామని 2018లో హామీ ఇచ్చినా, అమలుచేయలేదని, ప్రస్తుత ప్రభుత్వమైనా చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మండల కార్యదర్శి ఇస్లావత్ కళ్యాణ్, అధ్యక్షుడు ఎండి.సమీర్, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు నాగరాజు, రామ్‌చరణ్, రాజు, మోక్షిత్, అనూష, పల్లవి, రుచిత పాల్గొన్నారు.

కుష్ఠువ్యాధి నిర్మూలన ర్యాలీ

నెక్కొండ, జనవరి 30 : కుష్ఠువ్యాధి లక్షణాలు ఉంటే ప్రభుత్వాసుపత్రికి వెంటనే రావాలని నెక్కొండ ప్రాథమిక ఆరోగ్య వైద్య సిబ్బంది సూచించారు. జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మంగళవారం నెక్కొండలో ర్యాలీ నిర్వహించి కరపత్రాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కుష్ఠు వ్యాధి లక్షణాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఆరోగ్యవైద్య సిబ్బంది యాకస్వామి, సరిత, విజయ్, సంపతమ్మ, రమ, నాగమణి, మధవి, జయ పాల్గొన్నారు.

డీ వార్మింగ్ డే విజయవంతం చేయాలి


డీ వార్మింగ్ డే వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ప్రకాశ్‌రావు

ఖానాపురం, జనవరి 30: ఫిబ్రవరి 12న నిర్వహించే నులి పురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చే యాలని ఎంపీపీ వేములప ల్లి ప్రకాశ్‌రావు అన్నారు. మంగళవారం ఎంపీడీవో కా ర్యాలయంలో మండలస్థాయి అధికారులు, విద్య, ఐసీడీఎస్, వైద్య సిబ్బందిచే ఎంపీపీ వేములపల్లి ప్రకాశ్‌రావు అ ధ్యక్షతన అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ ఫిబ్రవరి 12న 1నుంచి 19 సంవత్సరాల వయస్సుగల పిల్లలందరికి నులిపురుగుల నిర్మూలన మాత్రలు వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో సుమనవాణి, వైద్యా ధికారులు జ్యోతి, కల్పన, రాకేష్, సునీత, వైద్య సిబ్బంది రామలింగయ్య పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌కు యూత్‌కన్వీనర్ రాణాప్రతాప్‌రెడ్డి రాజీనామా



నర్సంపేట, జనవరి 30 : బీఆర్‌ఎస్ పార్టీలో ఇటీవల జరుగుతున్న పరిణామాలు నచ్చక బీఆర్‌ఎస్ యూత్‌కన్వీనర్ పదవికి, పార్టీకి రాజీనామా చేసినట్లు బీఆర్‌ఎస్ యూత్ కన్వీనర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి తెలిపారు. పార్టీని వీడి కొంత కాలం బీజేపీలో కొనసాగినరాణా ప్రతాప్‌రెడ్డి తిరిగి బీఆర్‌ఎస్‌లో చేరి యూత్ కన్వీనర్‌గా కొనసాగారు. తాజాగా పార్టీలో జరుగుతున్న పరిణామాలు నచ్చక బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెబుతున్నట్లు వివరించారు. త్వరలో మళ్లీ బీజేపీలో చేరనున్నట్లు ఆయన మంగళవారం తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీలో ఇంతకాలం అవకాశం కల్పించిన పెద్ది సుదర్శన్‌రెడ్డికి, తనకు సహకరించిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరు సస్పెన్షన్

చెన్నారావుపేట, జనవరి 30: కాంగ్రెస్ పార్టీ నుంచి ఒకరిని సస్పెండ్ చేసినట్లు గ్రామ పార్టీ అధ్యక్షుడు తాళ్లపెల్లి నర్సయ్యగౌడ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రానికి చెందిన బొంత శ్రీనువాస్ అనే వ్యక్తి కాంగ్రెస్ పార్టీలో ఎలాంటి సంబంధం లేదని, పార్టీ వ్యతిరేఖ కార్యక్రమాలకు పాల్పడుతున్నందున మండల పార్టీ అధ్యక్షులు భూక్య గోపాల్‌నాయక్ ఆదేశాల మేరకు కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేయటం జరిగిందని తెలిపారు. ఆయనకు పార్టీతో ఎలాంటి సంబంధం లేదని ప్రకటనలో పెర్కొన్నారు.

బీజేపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా రవి



పర్వతగిరి, జనవరి 30: బీజేపీ ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడిగా మండలంలోని మూడెత్తులతండాకు చెందిన గుగులోత్ రవిని నియమించినట్లు రాష్ట్ర గిరిజన మోర్చా కార్యవర్గ సభ్యుడు హర్యావత్ వినోద్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ రాబోయే ఎంపీ ఎన్నికల్లో పార్టీ గెలుపునకు గిరిజనుల తోడ్పాటును బీజేపీ పార్టీకి అందేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు జాటోత్ శ్రీనివాస్‌నాయక్, నాయకులు కుడికాల శ్రీధర్ పాల్గొన్నారు.

ప్రతీ పౌరుడు తన హక్కులను తెలుసుకోవాలి

వర్ధన్నపేట రూరల్, జనవరి 30 : ప్రతీ పౌరుడు తన హక్కులను తెలుసుకునేందుకు కృషి చేయాలని వర్ధన్నపేట తహసీల్దార్ విజయ్‌సాగర్ అన్నారు. మంగళవారం కొత్తపెల్లిలో పౌర హక్కుల దినోత్సవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం మనకు ఎన్నో హక్కులను ప్రసాదించిందన్నారు.

రాయపర్తిలో దుప్పట్ల పంపిణీ

రాయపర్తి, జనవరి 30 : డీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం ఆర్టీఏ డీటీసీ పురుషోత్తం చేతుల మీదుగా వృద్ధులు, ఒంటరి మహిళలకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ ఐత బ్రహ్మం, కార్యదర్శి సుల్తానా పాల్గొన్నారు.


రాయపర్తిలో దుప్పట్లను పంపిణీ చేస్తున్న డీటీసీ పురుషోత్తం

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గ్రామసభ

రాయపర్తి, జనవరి 30: ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంగళవారం గ్రామసభ నిర్వహించారు. పౌరహక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సభలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో కిషన్‌లు పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీలు వారి హక్కులను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సైన్స్‌పై అభిరుచి పెంచాలి

నెక్కొండ, జనవరి 30 : పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో సైన్స్‌పై అభిరుచి పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జన విజ్ఞాన వేదిక జిల్లా బాధ్యులు, చెకుముకి మండల కన్వీనర్ బి.శ్రావన్‌కుమార్, నెక్కొండ జడ్పీ హై స్కూల్ హెడ్మాస్టర్ ఎం.రంగారావులు అన్నారు. నెక్కొండ హై స్కూల్‌లో మంగళవారం చెకుముకి టాలెంట్ టెస్టులో దీక్షకుంట ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఎ.శ్రావన్‌కుమార్, జి.విష్ణువర్ధన్, ఏ. అరుణ్‌కుమార్, ప్రైవేట్ పాఠశాల విభాగంలో బి.సహజల్‌యోధన్ శాస్త్రీ, జే.స్వరన్‌కుమార్, కె.విశాల్‌యాదవ్ ప్రథమస్థానంలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు.

డిజిటల్ బోధనను వినియోగించుకోవాలి: ఎంఈవో

ఖానాపురం, జనవరి 30: విద్యార్థులు డిజిటల్ బోధనను వినియోగించుకోవాలని ఎంఈవో రత్నమాల అన్నారు. మంగళవారం ధర్మరావుపేట ప్రాథమిక పాఠశాలలో ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ తరగతుల బోధనను ప్రారంభించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బీరయ్య, ఉపాధ్యాయులు కరుణాకర్, శోభారాణి, రాజేశ్‌రెడ్డి పాల్గొన్నారు.


ప్రొజెక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎంఈవో రత్నమాల

స్వీట్ హౌస్ హోటల్‌కు జరిమానా

దుగ్గొండి, జనవరి 30: గిర్నిబావిలో ప్రధాన రహదారిపై ఉన్న స్వీట్ హౌస్, హోటల్‌ను మంగళవారం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి కృష్ణమూర్తి తనిఖీ చేశారు. హోటల్‌లో పరిశుభ్రత పాటించడం లేదని, తాగు నీటి సౌకర్యం వద్ద అపరిశుభ్రత ఉన్నట్లు గుర్తించినట్లు యజమానికి రూ:2వేలు జరిమానాతోపాటు మెమో జారీ చేసినట్లు తెలిపారు.


స్వీట్‌హౌస్ యజమాని నుంచి జరిమానా వసూళ్లు చేస్తున్న సిబ్బంది

గ్రామ ప్రజలకు అందుబాటులో వైద్యం

వర్ధన్నపేట రూరల్, జనవరి 30 : గ్రామ ప్రజలకు ప్రభుత్వ వైద్యం అందుబాటులో ఉండే విధంగా ఆరోగ్య ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ గుజ్జ సంపత్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని కట్ర్యాల గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్ర నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కట్ట మహేష్, వార్డు సభ్యులు మహేందర్, రాజు, చాంద్‌బీ, అయోధ్య పాల్గొన్నారు.

'పార్క్'కు షాక్

5వ పేజీ తరువాయి

ప్రవేశపెట్టనున్న తాత్కాలిక బడ్జెట్‌లో పీఎం మిత్ర పథకం కింద అదనపు నిధులు వచ్చే అవకాశాలు లేనట్టు స్పష్టమవుతోంది.

ఎస్‌పీఏలో జాప్యం

కేంద్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం టెక్స్‌టైల్‌పార్క్ ఏర్పాటులో భాగంగా స్పెషల్ పర్పస్ వెహికిల్ (ఎస్‌పీఏ) జాయింట్ వెంచర్ కింద ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో జాయింట్ వెంచర్‌ను ఏర్పాటు చేయాల్సి ఉంది. ఇది చేస్తేనే పీఎం మిత్ర కిందకు పార్క్ వచ్చినందువల్ల గ్రీన్‌ఫీల్డ్ హోదా లభించేందుకు అవకాశం ఉంది. అప్పుడే కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు జరుగుతోంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల ఎస్‌పీఏ ఏర్పాటులోనే తీవ్ర జాప్యం జరిగింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఈ దిశగా దృష్టి సారించింది. సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు చేనేత జౌళి శాఖ అధికారులు ఎస్‌పీఏ, జాయింట్ వెంచర్ బాడీ ఏర్పాటు దిశగా కసరత్తు మొదలు పెట్టారు. ఈ ప్రక్రియ పూర్తి కావడానికి రెండుమూడు నెలలు పట్టువచ్చునని తెలుస్తోంది. ఇది పూర్తయిన తర్వాత గ్రీన్‌ఫీల్డ్ హోదా కోసం తాజాగా ప్రతిపాదనలు సమర్పించనున్నారు. ఒకసారి గ్రీన్‌ఫీల్డ్ హోదా లభించిన తర్వాత యేటా కేంద్ర బడ్జెట్‌లో పార్క్‌కు రూ.500.కోట్ల వరకు కేటాయింపు జరుగుతుంది.

గాంధీకి నివాళి


నెక్కొండలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నెక్కొండ, జనవరి 30 : మహాత్మగాంధీ వర్ధంతిని నెక్కొండ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు బక్కి అశోక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి రావుల హరీష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గొరంటల వీరయ్య, నాయకులు కుసుమ చెన్నకేశవులు, ఈదునూరి సాయికృష్ణ, భానుప్రకాశ్, రామారపు రాము, రమేశ్, కదురు సాంబయ్య, కక్కెర్ల నాగయ్య, తాల్లపెల్లి భాస్కర్ పాల్గొన్నారు.

- ఖానాపురం: జాతిపిత మహాత్మగాంధీ వర్ధంతిని బుధరావుపేటలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యడ్ల జగన్మోహన్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు శాఖమూరి హరిబాబు, ఎంపీటీసీ బిక్కి లింగమ్మమురళి, చెడిపాక ఉపేందర్, లాల్‌సాబ్, లింగయ్య, గూడ సూరయ్య, చాంద్‌పాషా పాల్గొన్నారు.
- దుగ్గొండి: మందపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో గాంధీ విగ్రహానికి హెచ్‌ఎం రామూర్తి పూలమాల వేసి నివాళులర్పించారు.
- చెన్నారావుపేట: కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల పార్టీ అధ్యక్షుడు భూక్య గోపాల్‌నాయక్ గాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులలర్పించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వెంకట్ రెడ్డి, నెక్కొండ బ్లాక్ కార్యదర్శి మంద యాకయ్యగౌడ్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌లు సిద్దెన రమేష్, తప్పెట రమేష్, మండల నాయకులు కుండు కుమారస్వామి, నరయ్య, మాజీ ఎంపీటీసీ ఈర్యానాయక్, ఆవుల రాములు, కోరే కుమారస్వామి, లక్క విజేందర్ పాల్గొన్నారు.


బుధరావుపేటలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కాంగ్రెస్ నాయకులు


చెన్నారావుపేటలో గాంధీ చిత్ర పటానికి పూల మాల వేస్తున్న గోపాల్‌నాయక్

ఎమ్మెల్సీ కోదండరామ్‌ను అడ్డుకోవడం రాజకీయ కుట్రే

▸ టీజేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్

నర్సంపేట, జనవరి 30 : రాజకీయ కుట్రలో భాగంగానే ప్రొఫెసర్ కోదండరామ్‌ను ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకారం చేయకుండా అడ్డుకోవడం జరిగిందని తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. పట్టణంలో మంగళవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఎమ్మెల్సీగా ప్రమాణస్వీకార సమయానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, కేసీఆర్, కేటీఆర్ ఆడిన డ్రామాలో భాగంగానే అయన ప్రమాణ స్వీకారం చేయలేక పోయారన్నారు. గవర్నర్ కోటాలో ఇచ్చిన ఎమ్మెల్సీ పదవిని న్యాయస్థానంలో తప్పుడు సమాచారం ఇచ్చి అడ్డుకోవడం హేయమైన చర్యన్నారు. కార్యక్రమంలో టీజేఎస్ జిల్లా అధ్యక్షుడు షేక్ జావిద్, సత్యనారాయణ, గుంటి రాంచందర్, కిరణ్, ఉమాపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న తెలంగాణ జనసమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్